జిల్లాలో 1,41,800 పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్ టి ఆర్ భరోసా పింఛన్లు కింద జిల్లాలో 1,41,800 పింఛన్లు మంజూరు అయ్యాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. "పేదలకు సేవ" కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీ నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,41,800మంది లబ్ధిదారులకు రూ.58.95 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. 2891 మంది సిబ్బంది భాగస్వామ్యంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, వెలుగు సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్

దీపం పథకం అర్హులకు రూ.164 కోట్లు లబ్ధి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో దీపం-2 పథకం కింద 1,97,727 మందిని అర్హులుగా గుర్తించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ అందజేస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని పట్టణంలో మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. ఈ పథకం పొందుకు ఆధార్ కార్డు నెంబరు, రేషన్ / బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబరుతో లింకు చేసిన బ్యాంకు ఖాతా (ఎకౌంటు) నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు ఉంటే సరిపోతుందని వివరించారు. లబ్ధిదారులు తమ వివరాలు లేకపోతే ఆయా సంస్థలు, శాఖల నుంచి పొంది నమోదు చేసుకొని ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చని ఆమె వివరించారు. పట్టణ ప్రాంతాల వారికి 24 గంటలలో గాను, గ్రామీణ ప్రాంతాల వారికి 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని మంత్రి తెలిపారు. మొదటిసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు లబ్ధిదారులు అక్టోబర్ 29 నుండి 2025 మార్చి 31వ తేదీ వరకు గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఐదు నెలల సుదీర్ఘ సమయం ఇవ్వడం జరిగిందని, కావున ఎవరూ గ్యాస్ బుకింగ్‌కు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. దీపం పథకం క్రింద సమస్యలుంటే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్సు)లో ఫిర్యాదు చేసుకునే వెసులబాటును ప్రభుత్వం కల్పించిందని మంత్రి చెప్పారు. జిల్లాలో 16 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 2,72,757 గ్యాస్ కనక్షన్స్ ఉన్నాయని, వీటిలో 1,97,727 మందిని దీపం-2 (3 ఉచిత గ్యాస్ సిలిండర్) పథకం అర్హులుగా గుర్తించామని రూ.164 కోట్లు లబ్ధి చేకూరుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాసు, తహశీల్దార్ ఎంవి రమణ, మున్సిపల్ కమిషనర్ ఎంసత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పార్వతీపురంటౌన్: ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర లబ్ధిదారులు అందజేశారు. అనంతరం రామాలయం దగ్గరలో సారిక వీధికి చెందిన పొట్నూరు ప్రభావతి ఇంటికి వెళ్లి దీపం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, జిసిసి మేనేజర్ కష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్లు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

డబుల్ కనెక్షన్ ఉంటే ఫ్రీ గ్యాస్ కట్?

అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ

పార్వతీపురం : తెలుపు రేషన్ కార్డులున్న వారంతా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి అర్హులేనని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ ప్రకటించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చెపుతున్న దాని ప్రకారం చూస్తే జిల్లాలో 2,81,000 తెలుపు రేషన్ కార్డులు వున్నాయి. వీరిలో 2,57,000 మందికి మాత్రమే గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే సింగిల్ గ్యాస్ కనెక్షన్ వున్న వారు మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లకు అర్హులని, రెండు, మూడు గ్యాస్ కనెక్షన్లు వున్న వారు అనర్హులని ప్రభుత్వం షరతు విధించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో సింగిల్ గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు లక్షా 97వేల 727 మంది. వీరు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి అర్హులని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2,57,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అంటే రెండు, మూడు గ్యాస్ కనెక్షన్లు ఉన్న సుమారు 60వేల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వర్తించదు. తెలుపు రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ వున్న వారంతా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి అర్హులని ఒకవైపు ప్రభుత్వ పెద్దలు మంత్రులు, ఎమ్మెల్యేలు ఊదరగొడుతుంటే మరోవైపు చాపకింద నీరులా తన మార్కు ఆదేశాలను కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. గత ఎన్నికల్లో టిడిపి కూటమి పార్టీలు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పేదలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి హామీ ఇచ్చాయి. అనుకున్న విధంగానే అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

బాధితులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఒకర్ని రెచ్చ గొట్టి.. మరొకరి కడుపు కొట్టి

- కులాల మధ్య కుంపటి
- పార్టీ పేరుతో తొలగింపులు
- మధ్యాహ్న భోజన వంటకాలకు రావద్దన్న టిడిపి నాయకులు
- ఖండించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-బలిజిపేట

కులాల మధ్య కుంపటి పెట్టి, పార్టీ పేరుతో బడుగు బలహీన వర్గాల్లో ఒకరిని రెచ్చగొట్టి ..మరొకరి కడుపు కొట్టి వారి బతుకల్ని రోడ్డున పడేస్తున్న సంఘటన బలిజిపేట మండలం అరసాడలో చోటు చేసుకుంటుంది. తక్కువ కులం వారు గనుక వంట చేసేందుకు రావద్దంటూ టిడిపి నాయకులు హెచ్చరించడం పట్ల సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర ఖండించారు. 22ఏళ్లు గా పనిచేస్తున్న వారిని పనికి రావద్దని చెప్పడం దుర్మార్గమని అన్నారు. వివరాల్లోకి వెళ్లే...

అరసాడ జెడ్‌పి హైస్కూలులో ముగ్గురు మహిళలు, ప్రాథమిక పాఠశాలలో ఒక మహిళ గత 20ఏళ్లుగా మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా వంటలు నిర్వహిస్తున్నారు. హైస్కూలులో పనిచేస్తున్న ముగ్గురిలో ఒకరు రజక, మరొకరు గిరిజన, ఇంకొకరు చేనేత కార్మిక మహిళలు ఉన్నారు. వీరిలో రజక, గిరిజన మహిళలను వంటకు రావద్దని గ్రామపెద్దలు హుకుం జారీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఒకే ఒక్క గిరిజన మహిళను తొలగించేందుకు ఆమెను సైతం రావద్దని చెబుతున్నారు. వీరందరినీ తొలగించి వేరే వారిని నియమించేందుకు కుట్రపన్ను తున్నారు. వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన గిరిజనులు, రజకులు. వారికి రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైన నాటి నుంచి గొడవ పార్వతి, గొడవ పద్మ, కొట్టి కళావతి, అరసాడ ఈశ్వరమ్మ మధ్యాహ్న వంట నిర్వాహకులుగా పని చేస్తున్నారు. ఎటువంటి జీతాన్నీ ఆశించకుండా, ప్రభుత్వం ఇస్తున్న అరకొర గౌరవ వేతనంతో వీరంతా పనిచేస్తున్నారు. తమకు మంచి రోజులు వస్తాయని, తమ కష్టానికి తగ్గ ఫలితం తప్పకుండా దక్కుతుందని ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో అధికారం లోకి వచ్చిన కొన్ని రాజకీయ రాబంధులు వారిపై కన్ను ఎర్రజేసి కులం పేరుతో చులకన చేసి, గిరిజన, రజక మహిళలని చూడ కుండా, నోటికి వచ్చిన భూతులని వాడి దుర్భాష లాడి, వారిని భయ బ్రాంతులకు గురి చేసి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. తాతల కాలం నుండి యంతో కలిసి కట్టు గా ఉన్న వారి మధ్య కులం, పార్టీల పేరుతో చిచ్చు పెట్టి గ్రామంలో సమస్యలు సృష్టిస్తున్నారు. వీరిని ఎలాగైనా తొలగించి తమ అనుచరులను నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులకు సిఐటియు నాయకులు మన్మధరావు, ఇందిర అండగా నిలిచారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణ ఎంపిక పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

త్వరలో వెలువడనున్న డిఎస్‌సి -2024 కోసం గిరిజన అభ్యర్థులకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తదితర కేంద్రాల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ నిర్వహించేందుకు గానూ గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఎంపిక కొరకు రాష్ట్రస్థాయి పరీక్ష ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాల్సిందిగా ఒక ప్రకటనలో తెలిపారు.

ఏజెన్సీలో పొగ మంచు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత వారం రోజులుగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పొగ మంచుదట్టంగా కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేకువ జామున మూడు గంటల నుంచి ఉదయం 7గంటల వరకు మంచు ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పొగ మంచు అలుముకోవడంతో వెళ్లే దారి కనిపించడం లేదు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు చిన్నవా పెద్ద కూడా తెలియని పరిస్థితి.

తహశీల్దార్‌గా శివన్నారాయణ

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

స్థానిక తహశీల్దార్‌గా ఎం.శివన్నారాయణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన పార్వతీపురంలో తహశీల్దారుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

అమరజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి - పార్వతీపురం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములును స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం గొప్పదని, ఆయన్ను ప్రతి ఆంధ్రుడూ గుర్తుపెట్టుకోవాలని పేర్కొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినమని, దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. తెలుగు భాషను మాట్లాడేవారంతా ఒక రాష్ట్రంలో ఉండాలన్న తలంపుతో పొట్టి శ్రీరాములు కొన ఊపిరి వరకూ పోరాడారని అన్నారు. అమరజీవి ప్రాణ త్యాగం మహెూన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోశ్ శ్రీవాస్తవ, డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కి నివాళి

సాలూరు : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాళులర్పించారు. ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు భావితరాలకు ఆదర్శప్రాయుడని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు,ఎం.మధుసూధనరావు పాల్గొన్నారు.

పెదపెంకిలో.... రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు

బలిజిపేట : పెదపెంకిలో ఆర్య వైశ్య కళ్యాణమండపం వద్ద ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహంకు నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన మహా వ్యక్తిని, ఆయన్ను యువత, ప్రజల ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మల్లెడ శ్రీరాములు, ఉత్తరావిల్లి వేణు, మల్లెడ నాని, తదితరులు పాల్గొన్నారు.

కోరన్న, మంగన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- గిరిజనుల హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు యువత ముందుకు రావాలి
- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కురుపాం

అమరవీరులు కోరన్న, మంగన్న స్ఫూర్తితో గిరిజన హక్కులను, చట్టాలను కాపాడుకోవడానికి గిరిజన యువత ఉద్యమించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. కోరన్న, మంగన్న 57వ వర్ధంతి వేడుకలు మండలంలో నీలకంఠాపురం పంచాయతీ మామిడి మానుగూడలో సిపిఎం నాయకులు మండంగి తిరుపతిరావు అధ్యక్షతన గురువారం జరిగాయి. తొలుత గ్రామంలో గిరిజన సంఘం, సిపిఎం నాయకులను డప్పు, మేళతాళాలు, కళాకారులను నృత్యాలతో ర్యాలీగా కోరన్న, మంగన్న అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి జెండాను ఆవిష్కరించి స్థూపాలకు పూలదండలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కృష్ణమూర్తి మాట్లాడుతూ 1960లో ఇక్కడున్న గిరిజనులచే భూస్వాములు, జమీందారులు వెట్టిచాకిరీ చేయిస్తుంటే గిరిజనుల హక్కుల కోసం భూస్వాములకు, జమీందారులకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన రైతాంగ ఉద్యమంలో కోరన్న, మంగన్న అమరులయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ విధానం పేరుతో గిరిజనులను అడవుల నుంచి తరిమివేయడానికి ప్రయత్నిస్తోందని, దీనిపట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 1/70 చట్టాన్ని ఎత్తి వేయడానికి ప్రయత్నిస్తుందని, గిరిజనులు భూములన్నీ పెత్తందార్లు చేతుల్లోకి వెళ్లనున్నాయని, ఈ ప్రాంతాన్ని కూడా అలా చేయడానికి చూస్తున్నారని అన్నారు. కావున కోరన్న, మంగన్న స్ఫూర్తితో ఈ ప్రభుత్వాల విధానాలకు నిరసనగా పోరాడాలని పిలుపు నిచ్చారు. చెముడుగూడ ఎంపిటిసి సభ్యులు ఎం.రమణ మాట్లాడుతూ గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని విమర్శించారు. సిపిఎం నాయకులు కోలక అవినాష్ మాట్లాడుతూ జీవో 3ను ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసి గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేయడానికి చూస్తుందని. జీవో 3 లేకపోతే గిరిజన యువత నిరుద్యోగులుగా మిగిలి పోవాల్సిన పరిస్థితి వస్తుందని కావున గిరిజన యువత ముందుకు వచ్చి వీటన్నింటికీ వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం కోరన్న, మంగన్న స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు, కొల్లి గంగునాయుడు, కోరాడ ఈశ్వరరావు, మండంగి శ్రీనివాసరావు, గిరిజన సంఘం, సిపిఎం నాయకులు, చుట్టు పక్కల గిరిజన గ్రామాల నుండి అధిక సంఖ్యలో గిరిజనులు ప్రజలు సభలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : నాటి శ్రీకాకుళం రైతాంగ ఉద్యమంలో కోరన్న, మంగన్న పోరాటాల ఫలితంగా సాధించుకున్న గిరిజన హక్కులు, చట్టాలను నేటి పాలక ప్రభుత్వాలు తమ స్వార్థం కోసం నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. కోరన్న, మంగన్న వర్ధంతి సందర్భంగా గుమ్మలక్ష్మీపురం ఉన్న స్థూపం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం నాయకులు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్, సిపిఎం సీనియర్ నాయకులు ఎం కష్ణమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు మండంగి శ్రీనివాసరావు, ఎం సన్యాసి రావు, బిడ్డిక శంకరరావు, పి.తిరుపతిరావు ఉన్నారు.

సీతంపేట : స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో కోరన్న, మంగన్న 57వ వర్ధంతి సభ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ కోరన్న, మంగన్న ఆశయాలను కొనసాగించాలన్నారు భూసమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వీరన్న, శ్రీరాములు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక సిపిఐ ఎంఎల్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు ఆధ్వర్యంలో కోరన్న , మంగన్న వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి భాస్కరరావు మాట్లాడుతూ కోరన్న, మంగన్న ఆశయాలు నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్ విటలేశ్వర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు డి.సూర్యకళ, సిహెచ్ ఝాన్సీ, జామి జ్యోతి, మండల కార్యదర్శి కర్రి శ్రీనివాసరావు, ఎ.గౌరీశంకర్, ఎఐసిసిటియు కోశాధికారి ఎస్ రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ ఉమా మహేశ్వరరావు, జి.అక్కంనాయుడు, ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, వేదికపై గిరిజన సంఘం నాయకులు

నేటి నుంచి రోడ్ల మరమ్మతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రహదారి గుంతల మరమ్మతుల పనులు శనివారం నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రహదారి గుంతల మరమ్మతుల కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన వెంటనే జిల్లాలో పనులు మొదలు కానున్నాయనిచెప్పారు. ఆర్అండ్‌బికింద పార్వతీపురం నియోజక వర్గంలోని మరిపివలస - బూర్జ రహదారి పనులు రూ.5 లక్షలతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా 1/8 నుండి 2/6 కిలో మీటర్ల వరకు, 3/8 నుండి 4/8 కిలో మీటర్ల వరకు, 9/6 నుండి 11 కిలో మీటర్లు వరకు చేపడతారన్నారు. సాలూరు నియోజకవర్గంలో కురుకుట్టి మీదుగా సాలూరు నుంచి దళాయివలస రహదారి పనులు రూ.7 లక్షలతో చేపనున్నారని తెలిపారు. ఈ పనుల్లో భాగంగా 0/0 నుంచి 2/6 కిలో మీటర్ల వరకు, 3/0 నుంచి 4/4 కిలో మీటర్ల వరకు గుంతలను పూడ్చనున్నట్టు తెలిపారు. అలాగే కురుపాం నియోజక వర్గంలో చిలకపాలెం - రామభద్రాపురం - రాయగాడ రాష్ట్ర రహదారి పనులు రూ.100 లక్షలతో చేపడుతున్నట్టు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా 108/6 నుండి 120/6 కిలో మీటర్ల వరకు, 121/6 నుండి 122/8 కిలో మీటర్ల వరకు, 124/2-4, 128/2 నుండి 130/4 కిలో మీటర్లు వరకు బిట్లుగా చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. రస్తాకుంటుబాయి - పెద గొర్తిలి రహదారి పనులు రూ.30 లక్షలతో చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పాలకొండ నియోజక వర్గంలో తలవరం మీదుగా వెళ్లే సి.ఎస్.పి (కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం) రహదారి పనులు రూ.40 లక్షలతో చేపట్టడం జరుగుతుందని, ఈ పనుల్లో భాగంగా 0/0 నుండి 5/7 కిలో మీటర్ల వరకు, 8/017 నుండి 8/750 కిలో మీటర్ల వరకు, 12/6 నుండి 15/2 కిలో మీటర్లు వరకు చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు మరమ్మతు పనులకు మోక్షం

కొమరాడ : ఐదేళ్ల నుంచి అధ్వానంగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి రోడ్డు మరమ్మతు పనులకు మోక్షం కలుగుతుంది. ఈ మేరకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రోడ్డు మరమ్మతు పనులను శనివారం గుమడ సమీపంలో ప్రారంభిస్తారని మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు తెలిపారు. పార్వతీపురం నుండి కునేరు వరకు గల 26కిలోమీటర్ల రహదారి మరమ్మతు నిమిత్తం కోటి రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ హాజరుకానున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయుడు హఠాన్మరణం

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని గుచ్చింకి చెందిన పెద్దింటి శివాజీ గురువారం రాత్రి హఠార్మణం చెందారు. ఈయన గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డు వివాదం

తాత్కాలిక స్థలాల గుర్తింపు పరిస్థితి ఏమిటి?

వైసిపి కౌన్సిలర్లపై గంటా సంతోష్ ధ్వజం

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి, వైసిపి మధ్య డంపింగ్‌యార్డు సమస్య వివాదం రాజుకుంటుంది. రోజురోజుకు వారి మధ్య మాటల యుద్ధం రాజుకుంటుంది. మీరే అడ్డుకున్నారంటే మీరే అడ్డుకున్నారని పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఓనికి వెళ్లే ప్రాంతంలో బత్తులవాని చెరువు వద్ద తాత్కాలిక స్థలం గుర్తించడంపై టిడిపి పట్టణ అధ్యక్షుడు గంట సంతోష్ వైసిపి పాలకవర్గంపై విరుచుకుపడ్డారు. గురువారం బత్తులవాని చెరువు పరిశీలించడానికి వెళ్లిన కౌన్సిలర్ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. తమ ప్రాంతానికి చెందిన రైతులే దీని వల్ల నష్టపోతున్నారని, గతంలో కూడా తెలుకవాని చెరువు వద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల తమ ప్రాంత వాసులే ఇబ్బందులకు గురయ్యారని, మళ్లీ ఇప్పుడు బత్తులవాని చెరువును గుర్తించి తమ ప్రాంత రైతులకు అన్యాయం జరిగిందని సంతోష్ ఆరోపించారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు కూడా సంతోష్‌ను నిలదీశారు. తాము డంపింగ్‌యార్డు విషయంలో మాటకు కట్టుబడి ఉన్నామని, మీరే అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీనికి ఇరువురి మధ్య వాదోపవాదనలు చోటు చేసుకుంది. శాశ్వత పరిష్కారం చూపకుండా ఇదేమిటని సంతోష్ ప్రశ్నించారు. దీంతో కమిషనర్ సర్వేశ్వరరావు నివ్వెరపోయారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

గిరిజన సహకార సంస్థలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా పనులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలు ఉద్యోగాల్లేక చాలా ఇబ్బందులకు గురైవుతున్నామన్నారు. ప్రభుత్వం తమ ఇబ్బందులను గమనించి తమకు కారుణ్య నియామకాలును చేపట్టాలని మంత్రిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కషి చేస్తానని తెలిపారు.

ఏకలవ్య పాఠశాలకు సిసి రోడ్డు

ప్రజాశక్తి -భామిని

భామిని లోని ఏకలవ్య పాఠశాలలో రూ.40లక్షలతో సిసి రోడ్డు పనులను సోమవారం చేపట్టారు. భామిని ప్రధాన రహదారి నుండి ఏకలవ్య పాఠశాలలోని డార్మిటరీ, ఏకలవ్య పాఠశాల సిబ్బంది నివాసాలను కలుపుకుని 600 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని జెఇ సత్యనారాయణ తెలిపారు. సి సి రోడ్లు నిర్మాణంలో భాగంగా గతంలో 3 కల్వర్టులు నిర్మించామని తెలిపారు.

చురుగ్గా సాగుతున్న రోడ్డు పనులు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలో శుక్రవారం పర్యటన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని ఆయన తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు.

చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జయకృష్ణ

3న మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 3న మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బివి నాయుడు, ఎస్.సతీష్, జి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ప్రతిభ పరీక్ష రాసేందుకు సిద్ధం కావాలని కావాలని, ఒక్కొక్క తరగతి నుంచి ఆరుగురు చొప్పున హాజరుకావాలని తెలిపారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వారి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో అపార్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ప్రగతిని సిఆర్ఎంటిలతో సమీక్షించారు. పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్ వారీగా అపార్ నమోదును పరిశీలించారు. ఆన్లైన్ నమోదు తక్కువగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే సిఆర్ఎంటిలు కాంప్లెక్స్ స్కూల్స్ హెచ్ఎంలతో మాట్లాడి అపార్ ఆన్లైన్ నమోదు వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఏమైన ఉంటే జిల్లా ఐటిసెల్‌కు తెలియజేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లి క్రీడాకారిణి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఐటిడిఎ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సివిల్ సర్వీసెస్ మహిళల 35 ఏళ్ల పైబడిన బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని మామిడిపల్లికి చెందిన సర్గం యశోదమ్మ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. యశోదమ్మ ప్రస్తుతం మామిడిపల్లి, కందుల పదం సచివాలయాల హెల్త్ సెక్రటరీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యశోద క్రీడ కోటాలో ఉద్యోగం సాధించడమే కాక, ఇంతకుముందు కూడా అనేక రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిందని శ్రీరాములు తెలిపారు. యశోదమ్మ ఈనెల 6 నుంచి 9 వరకు విజయవాడ దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందని శ్రీరాములు తెలిపారు. యశోద ఎంపిక పట్ల వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, బూస తవుడు, సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, డొంక అన్నపూర్ణ, తాడుతూరి తిరుపతిరావు, సర్పంచ్ శశికళ, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ శ్రీను అభినందనలు తెలియజేశారు.


విద్యార్థిని, పిఇటిలను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు కొమరాడ గురుకుల విద్యార్థి

ప్రజాశక్తి కొమరాడ

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కొమరాడకు చెందిన పదో తరగతి విద్యార్థి సిహెచ్ రోహిత్ అండర్ -17 విభాగంలో 800మీటర్లు, 3కిలోమీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈనెల 3,4 తేదీల్లో శ్రీకాకుళంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తమ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి రోహిత్‌ను, వ్యాయమ ఉపాధ్యాయులు హరి, కమలహాసన్‌ను అభినందించారు.

తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలి

ప్రజాశక్తి - సీతానగరం

పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని మండల ప్రత్యేక అధికారి కె.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉపాధ్యాయులు సారించాలన్నారు. గతంలో మంచి ర్యాంకులు సాధించిన పాఠశాలలు ఇంకా మంచి ర్యాంకు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జి.భారతి, ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ప్రజాశక్తీ - వీరఘట్టం

టిటిడి బోర్డు సభ్యులుగా వైద్యం శాంతారాం నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అరకు పార్లమెంటరీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ దల్లవలస శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన, నిరంతర కృషీవలుడు శాంతారాంను సభ్యునిగా నియమించడం శుభ పరిణయ మనీ అన్నారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్యదర్శి పి రవికుమార్, మండల అధ్యక్షులు ఎస్ గోపాలం, పి మజీస్వరరావు , శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు గోవిందరావు కే సింహాచలం శివాజీ దుర్గ ప్రసాద్ వీరఘట్ట మండల నాయి బ్రాహ్మణ సభ్యులు కూడా కతజ్ఞతలు తెలిపారు.

గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలి

- 6నుంచి గ్రామాల్లో పాదయాత్ర లు
- ఎమ్మెల్యేను కలిసిన బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలని బడిదేవర కొండ పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు బంటు దాసు, బి.అప్పలనాయుడు, సిపిఎం నాయకులు బి.జీవ, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, ఎబిటియసి నాయకులు శ్రీ ఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంగం, సూరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 6నుంచి బడిదేవరకొండ తవ్వకాల వల్ల ప్రభావితమయ్యే గ్రామాల్లో ప్రజల్ని చైతన్యవంతం చేయడానికి పాదయాత్ర లు చేపడతామని చెప్పారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న కమిటీ నాయకులు కృష్ణమూర్తి

ఎమ్మెల్యేను కలిసిన పరిరక్షణ కమిటీ సభ్యులు

స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్రను బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు కలిశారు. బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలని కోరారు.

రహదారులు నిర్మించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పివి ఈత మానుగూడ పంచాయతీలో సలాభం పాడు సెంటర్ నుంచి దొంబింగివలస వరకు రోడ్డు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.భాస్కరరావు విమర్శించారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏటా గ్రామస్థులే రహదారి నిర్మాణం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 12ఏళ్ల క్రితం సిమ్మెంటు రోడ్ నిర్మించిన సందర్భంగా 350 మీటర్లు రోడ్డు వేయకుండా విడిచారని చెప్పారు. ఈ విషయంపై అనేక దఫాలు అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. రోడ్డు నిర్మించి దశాబ్దం పూర్తి అయినా మరమ్మతులు, నిర్వహణ పనులు చేయలేదన్నారు. ఐటిడిఎ కోట్లాది రూపాయలు ట్రైబల్ వెల్ఫర్ ద్వారా ఖర్చు చేసిన గిరిజనులకు ఈ దుస్థితి ఉన్నదో ప్రాజెక్ట్ అధికారులు ఆలోచన చేయాలని అన్నారు. అదేవిధంగా ఈ పంచాయతీ పరిధిలో గల కొత్తగూడ రోడ్ 900 మీటర్లు పని, (60 లక్షలు) ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదు. అందువల్ల నెలరోజులలోగా ఈ పనులు పూర్తి కాకపోతే సిరికొండ, ఒబ్బంగి, దొంబంగి వలసకు చెందిన గ్రామస్తులతో ట్రైబల్ ఆఫీస్ వద్ద వంటా వార్పు కార్యక్రమం చెప్పడతామని హెచ్చరిక చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పాంచాలి, గురివినాయుడుపేటలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పాంచాలి నుండి కొత్తవలస బిటి రోడ్డు రూ.2కోట్లు, కొత్తవలస నుండి కూనంబందవలస వరకు రూ.2 కోట్లు, గురివినాయుడుపేట నుండి పూడి వరకు అత్యవసర మరమ్మతులకు రూ.60 లక్షలు మొత్తం రూ.4.60 కోట్ల నిధులతో బిటి రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గురువునాయుడుపేటలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా నెరవేరుస్తున్నామన్నారు. మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం తప్పిదలవల్ల రాష్ట్రం పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేక అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచులకు పూర్తిగా అధికారమిచ్చి గౌరవం ఇచ్చిందని మంత్రి స తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, పార్టీ నాయకులు ఎం.సూర్యనారాయణ, కె.సురేష్. పి.నర్సింగరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ పాత్రో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

మండలంలోని మోసురు నుంచి 20 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరాయి. వీరికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ధరలపై నియంత్రణ ఉండాలి : ఐద్వా

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఐద్వా సాలూరు కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలో జరిగిన ఐద్వా సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి.ఇందు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు నెలలు ధరలు అదుపు చేయకపోవడం వల్ల వంటనూనె, కందిపప్పు, కూరలు, ఉల్లి నిత్యవసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం పేదలు తినే తిండిపై పడిందన్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత గ్యాస్ ఇవ్వడం సంతోషమే అయినా గ్యాస్‌పై వండుకు తినేందుకు నిత్యవసర సరుకులు అందుబాటులో లేకపోవడం అన్యాయమని తెలిపారు. ఎటువంటి అభివద్ధి చెందని సాలూరు వంటి వెనుకబడిన ప్రాంతాల్లో రోజువారి కూలి తెచ్చుకోవడమే మహిళకు కష్టమని, ఉన్న జ్యూట్ ఫ్యాక్టరీ మూతపడడంతో దానిపై ఆధారపడ్డ మహిళా కార్మికులు రోడ్లు పడ్డారని, ఎలాంటి కూలీ లేని పరిస్థితి మహిళలకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మూతబడి వున్న జ్యూట్ మిల్‌ను తెరిచి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు గుడి, బడి, మెయిన్‌కు దగ్గరగా ఉన్నాయని, వీటిని ఎక్సైజ్, పోలీసు అధికారులు తొలగించాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో జరిగే అనర్ధాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. నిర్మాణం పూర్తయిన వాడుకునే అవకాశం లేకుండా అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు బజారు తెరవలేదని, ఇప్పటికైనా రైతు బజార్ వాడుకలోకి తెచ్చి, పెరిగిపోతున్న ధరలు, పెరిగిన సరుకులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా నాయకులు స్వప్న ,సీత పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా పటేల్ జయంతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం ఆంధ్ర ప్రదేశ్ అవతరణ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష ఫలితమన్నారు. అలాగే రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన సందర్భంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు రన్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలను పట్టుకొని రన్ చేసి జాతీయ ఐక్యతను చాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.కల్పన, స్వరూప, తులసి, అశోక్, సింహాచలం, హరికష్ణ సత్య శ్రీకాంత్, చిన్నారావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతోనే ఆరోగ్యవంతమైన జీవనం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యవంతమైన పంట పండాలని ఆరోగ్యవంతమైన పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలని మన్యం జిల్లా శిక్షణ కేంద్రం ఎడిఎ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. అమ్మవలస, మంచాడవలసలో నిర్వహించిన రైతు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతూ ఎండోసల్ఫాన్ వంటి మందులు నిషేధానికి కారణం వాటి అవశేషాలు పంటల్లో ఎక్కువ కాలం ఉండడం, వాటిని పిచికారీ చేసినవారు విష ప్రభావానికి లోనవ్వడం, కూరగాయలు పండించే రైతులు మోనోక్రోట ఫాస్వంటి మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవాలని భూమిలో పోషకాలు పెంపొందించడానికి పచ్చిరొట్ట, నవధాన్యాలు వంటివి వేసి కలియదున్నాలని అన్నారు. అనంతరం అంతర్ పంటల విధానం పాటించాలని, ఆరోగ్యవంతమైన పంట పండించడం సాధ్యమవుతుందని తెలిపారు. మొక్కజొన్నపై కత్తెరపురుగు అతి ప్రధానమైందని, దీని నివారణకు గుడ్లను నివారించే వేప కషాయం మందును పిచికారీ చేశాకే ఇమామెక్టిన్ బెంజోయేట్ వంటి రసాయనాలు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ప్రతి గ్రామంలో రైతులకుప్రకృతి సేద్య శిక్షణ ఇచ్చి దాన్ని ప్రోత్సహించాలని సిబ్బంది సురేష్ కుమార్, విజయ్‌కుమార్‌కు సూచించారు. రైతులు కూడా కొద్ది మొత్తంలోనైనా ప్రకృతి సేద్యాన్ని చేసి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. పత్తి, వరి పంటల్లో చీడ, పీడల నివారణకు రసాయన, ప్రకృతి సేద్య పద్ధతులను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు, అమ్మవలస గ్రామ పెద్దలు రేయి అప్పారావు, విఎఎ బోను మోహన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి

మాటకు కట్టుబడిన ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లక్కగూడలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా 1న లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శనరావు, మాజీ సర్పంచ్ కళావతి, నాయకులు చిన్న, రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పింఛన్ల పంపిణీని పరిశీలించిన స్పెషలాఫీసర్

సీతానగరం : మండలంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రసన్నకుమార్ పరిశీలించారు. పెద్ద అంకలాం, పెద్ద భోగిలి, అప్పయ్యపేట గ్రామాల్లో పెన్షన్ పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ నూటికి నూరు శాతం పూర్తి కావాలన్నారు. మధ్యలో సర్వర్లు అంతరాయం కలగ్గా, వెంటనే అధికారులు సరి చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

సర్వర్ పనిచేయక పింఛనర్ల పాట్లు

వీరఘట్టం : మండలంలో ప్రతి నెలా ఒకటో తేదీన వితంతు, వృద్ధాప్య, వికలాంగులు, కల్లుగీత, వంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సర్వర్ పనిచేయకపోవడంతో ఇటు పింఛనుదారులు, అటు పింఛన్ పంపిణీ చేసే అధికారులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది శుక్రవారం ఉదయాన్నే లబ్ధిదారులు ఇళ్లకు చేరుకున్నప్పటికీ సర్వర్ పని చేయకపోవడంతో ఎక్కడా పూర్తిస్థాయిలో పంపిణీ జరగలేదు. 12 గంటల తర్వాత సర్వర్ పనిచేయడంతో పంపిణీ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో అన్ని రకాల 9,756 పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు.

కేశవ నాయుడు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా రెవెన్యూ అధికారిగా సేవలందించిన జి.కేశవ నాయుడు సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్తున్న కేశవనాయుడుకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కేశవ నాయుడుకు సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేశవనాయుడు పని పట్ల అంకిత భావంతో పనిచేశారన్నారు. అన్నివేళలా కార్యాలయానికి అందుబాటులో ఉంటూ తన పనిలో ప్రశంసనీయమైన దృక్పథాన్ని కనబర్చారని పేర్కొన్నారు. సిబ్బందికి మార్గదర్శకం వహించడంలోనూ పై అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంలోనూ సమన్వయం చేశారన్నారు. ఎన్నికలవేళ పనిచేయడం కష్టసాధ్యమని అటువంటి ఎన్నికల సమయంలోనూ చాకచక్యంగా పనిచేసే జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని కలెక్టర్ అన్నారు. వృత్తిలో అంకితభావం ఉండటం వల్ల ఉత్తమ పనితీరును చూపించవచ్చని, అటువంటి పరిస్థితిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని అన్నారు. బదిలీపై వెళ్తున్న కేశవ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చిందని అన్నారు. బదిలీ రావడంతో వెళ్లడం జరుగుతుందని, అందరూ చక్కని సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎండి గయాజుద్దీన్, డిపిఆర్ఒ ఎల్.రమేష్, కలెక్టరేట్ ఎఒ సావిత్రి, సెక్షన్ సూపరింటెండెంట్ జి.శ్రీరామ్మూర్తి, సి - సెక్షన్ సూపరింటెండెంట్ రాధాకష్ణ, హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, సిపిఒ పి.వీర్రాజు, ఉసిబ్బంది పాల్గొన్నారు.

డిఆర్ఒను సన్మానిస్తున్న కలెక్టర్

ఏనుగులను తరలించండి : సిపిఎం

ప్రజాశక్తి -కొమరాడ

జిల్లాలో 144 సెక్షన్ వద్దు ఏనుగులు తరలించడమే ముద్దు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. అటవీ శాఖ అధికారులు ఏనుగులను సురక్ష ప్రాంతాన్ని తరలించేలావేగవంతంగా చర్యలు చేపట్టాలని కోరారు. గత శనివారం డిఎఫ్ఒ ప్రసూన ఏనుగులు తిరిగే గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని, కాబట్టి ఏనుగులు తిరిగే ప్రాంతంలో 300 మీటర్ల దూరంలో ఉండాలని కవ్వింపు చర్యలు చేపట్ట రాదని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా కుంకీ ఏనుగులపై దృష్టి పెట్టి ఆ ఏనుగులు జిల్లాకు వెంటనే రప్పించి ఇక్కడ ఉన్న ఏనుగులను అడవికి లేదా జూకి తరలించాలని, రైతులకు, పంటలకు అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరారు.

పేదలకు అండగా నిలబడడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

పేద ప్రజలకు అండగా నిలబడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దీపం పథకం ద్వారా ఇంటింటికీ గ్యాస్ ఉండేలా, దీపం 1.0ను జూలై 9, 1999న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. నేడు 25ఏళ్ల తర్వాత గ్యాస్ ధరలు అధికంగా ఉండడంతో, పేద ప్రజలకు ఊరటనిచ్చేలా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తూ, దీపం-2 పథకాన్ని ప్రారంభించి పేద ప్రజలను ఆదుకునే ఘనత చంద్రబాబు నాయుడుకే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి రమణమూర్తి, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షులు ఎన్.వంశీ, టిడిపి నాయకులు ఆకుల రమేష్, బోటు గౌరీ, సుకేష్ పండా, చంటి, సాయి తదితరులు పాల్గున్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం 3వ అదనపు జూనియరు సివిలు జడ్జివారి కోర్టులో

O.S.935/2021

Between:
Doddi Sunanda and others .....Plaintiff
And :
Asapu Linga Raju and others ....Defendants
Notice to
D-1 : Asapu Linga Raju, S/o Rama Rao, D.No.13-481, Goods Shed Road, Parvathipuram Town, and also Goods Shed, Vizianagaram.

ఇందుమూలంగా మీకు తెలియజేయునదేమనగా పై నెంబరు దావాలో వాదులు దావా షెడ్యూలు ఆస్తికి వారే హక్కుదారులని తీర్మానించమని, కోరుచూ మీపై దాఖలు చేసి అనేకసార్లు పై కోర్టువారి నుండి మీకు నోటీసు నిమిత్తం పంపినా మీరు తీసుకోనందున సదరు దావా మీకు నోటీసు నిమిత్తం తే 20-11-2024దీకి వాయిదా వేసిరి. పై దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే 20-11-2024దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Plaintiff
Gurachari Street,
D.No.19-2-15,
Vizianagaram-2,
Cell : 9441053628

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వాహనదారుడు మృతి

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని హడ్డుబంగి సమీపాన ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టింది. దీంతో వాహనచోదకుడు పైల రామ్మోహన్ రావు (27) అక్కడికి అక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కొత్తూరు నుండి పాలకొండ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి హడ్డుబంగి సమీపంలో ఢీకొట్టింది. దీంతో పాలకొండ మండలం ఎన్‌కె రాజపురం గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు అక్కడికక్కడ మృతి చెందాడు. బైకు వెనుక కూర్చొన్న కె.శ్రావణి కాలు, చెయ్యి విరిగిపోయింది. దీంతో సీతంపేట ఏరియా ఆసుపత్రి నుంచి పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలంలో రామ్మోహనరావు మృతదేహం

బైక్ బోల్తా : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొసగూడకు చెందిన బిడ్డిక సంజీవరావు తాను నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్విన్‌పేట నుంచి కొసగూడకు వెళ్తుండగా డిగ్రీ కాలేజ్ ప్రధాన రహదారి వద్ద బైక్ అదుపుతప్పింది. గాయపడి వ్యక్తిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నారు.

పాము కాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో వాజ్జయిగూడ చెందిన సవర లక్కమ్మ (58) పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రజలు చికిత్స అందించి సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు.